సాక్షి
ప్రకాశం
మంగళవారం । 22 । జూలై । 2025



తారస్థాయికి రెడ్‌బుక్ పాలన

కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పాలన తారస్థాయికి చేరిందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు అన్నారు. - 10లో..



ముమ్మాటికీ మృత్యుకేళి

మార్కాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడాదిగా ఆక్సిజన్ ప్లాంట్ మూతపడింది. ఆస్పత్రి వైద్యులు, ప్రొఫెసర్ల బదిలీతో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది. - 10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30 /25


ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి మంచి దిగుబడులు సాధించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా రైతులకు సూచించారు. బయో ఫెర్టిలైజర్స్, జీవ ఎరువుల వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఒంగోలు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సోమవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణతో కలిసి ఆమె ప్రారంభించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గిస్తే రైతులకు సాగు ఖర్చులు కూడా తగ్గుతాయని ఆమె అన్నారు. బయో ఫెర్టిలైజర్స్, జీవ ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాల గురించి జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎస్.శ్రీనివాసరావు వివరించారు. బయో ఫెర్టిలైజర్స్ వాడకం వల్ల నేలసారం మెరుగుపడుతుందన్నారు. ఈ విషయాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ స్టాల్ ఏర్పాటు చేశామన్నారు. రైతులకు అవసరమైన బయో ఫెర్టిలైజర్స్ అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా బయో ఫెర్టిలైజర్స్, జీవ ఎరువులు తయారు చేసే దోర్నాలకు చెందిన రైతు ఈదర శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కషాయాలు, ఇతర ప్రకృతి ఆధారిత ఉత్పత్తుల వల్ల రైతులకు సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతుందన్నారు. ఉత్పత్తి కూడా పెరగటంతో పాటు రైతుకు మంచి ధర వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ వి.సుభాషిణి, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ రజినీ కుమారి, ఒంగోలు ఏడీ రమేష్ బాబు పలువురు అధికారులు ఉన్నారు.



వేతనాలందక.. వేదన తీరక!

- పొజిషన్ ఐడీల కేటాయింపుల్లో నిర్లక్ష్యం
- బదిలీలు జరిగి నెలరోజులు కావస్తున్నా ఇవ్వని ఐడీలు
- జీతాలు రాక అవస్థలు పడుతున్న టీచర్లు
- విద్యాశాఖ నిర్లక్ష్యంపై మండిపడుతున్న ఉపాధ్యాయులు
- 1600 మంది గురువులపై ప్రభావం
- వెంటనే ఐడీలు ఇవ్వాలంటున్న ఉపాధ్యాయ సంఘాలు

ఒంగోలు సిటీ:

వేసవి సెలవుల అనంతరం స్కూళ్లు ప్రారంభమైనా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతూనే వచ్చాయి. అర్ధరాత్రి వరకూ కౌన్సెలింగ్ నిర్వహించడంతో వారు పడిన అగచాట్లు అన్నీ ఇన్నీకావు. మే నెల చివర్లో ప్రధానోపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభమైంది. తొలి రెండు రోజులు ఆన్‌లైన్ సమస్యలు తలెత్తాయి. ఆ తర్వాత ఎస్జీటీల బదిలీల ప్రక్రియ మొదలైంది. ఆన్‌లైన్ వద్దని ఆఫ్‌లైన్‌లో బదిలీల కౌన్సెలింగ్ చేపట్టాలని ఆందోళన చేశారు. కలెక్టరేట్‌ను ముట్టడించారు. ప్రభుత్వం దిగిరావడంతో కౌన్సెలింగ్ ప్రారంభమైంది. రకరకాల సమస్యలతో కౌన్సెలింగ్‌కు అవాంతరాలు ఎదురవుతూ వచ్చాయి. అర్ధరాత్రి వరకూ కౌన్సెలింగ్ నిర్వహించడంతో మహిళా ఉపాధ్యాయులతో పాటు వారి కుటుంబ సభ్యులు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచి పడిగాపులు పడాల్సి వచ్చింది. ఎట్టకేలకు గత నెల 15వ తేదీన ముగించారు. ఉమ్మడి జిల్లాలో 3931 మందికి స్థానచలనం కలిగింది. ఇదంతా ఒక ఎత్తయితే బదిలీ అయిన వారికి విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో కొత్త సమస్య ఎదురైంది.

పొజిషన్ ఐడీల కేటాయింపుల్లో తీవ్ర నిర్లక్ష్యం...

ఉద్యోగులు, ఉపాధ్యాయులు సాధారణంగా బదిలీ అయిన ప్రాంతాల్లో జీతాలు తీసుకునేలా ఆ ప్రాంతంలోని డీడీఓలకు సమాచారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. దీని కోసం ఉపాధ్యాయులకు ఐడీలు కేటాయించాలి. బదిలీలు పూర్తయి నెల రోజులు దాటినా ఇంత వరకు చాలా మంది ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలను కేటాయించలేదు. దీంతో జూన్ నెలకు సంబంధించి జూలైలో రావాల్సిన జీతాలు ఉపాధ్యాయులకు అందకపోవడంతో ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినా ఉపయోగం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వచ్చే నెల కూడా తమకు జీతాలు పడే అవకాశాలు కనిపించడం లేదని ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఇలా చిన్నచూపు చూడడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పొజిషన్ ఐడీలు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

జీతాలందక పాట్లు..

పాఠశాలల ప్రారంభంలో జూన్ నెలలో ప్రతి కుటుంబంలో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో పిల్లల స్కూల్ ఫీజులు, విద్యా సామగ్రి కోసం వేలల్లో వెచ్చించాల్సి ఉంటుంది. అలాగే ఉపాధ్యాయులు బదిలీ అయిన ప్రాంతానికి వెళ్లేందుకు రవాణా ఖర్చులు, ఇంటి అద్దెలు, అడ్వాన్సుల రూపంలో మరింత ఖర్చు పెరిగిందని, ఇటువంటి సమయంలో కూటమి ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో నానా అగచాట్లు పడుతున్నామని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

1600లకు పైగా టీచర్లపై ప్రభావం..

ఉమ్మడి జిల్లాలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కల్పించకపోవడంతో సుమారు 1600 మందికి పైగా జీతాలు పడక నానా అగచాట్లు పడుతున్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రేడ్ ప్రధానోపాధ్యాయులు 500కు పైగా ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్, సమాన స్థాయి కేడర్ ఉపాధ్యాయులు వరుసగా బయోలాజికల్ సైన్స్ 69 మంది, ఇంగ్లిష్ 83 మంది, హిందీ 57 మంది, మ్యాథమేటిక్స్ 92 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీడీ) 35 మంది, ఫిజికల్ సైన్స్ 76 మంది, సోషల్‌స్టడీస్ 35 మంది, తెలుగు లాంగ్వేజ్ పండితులు 50 మంది, ఉర్దూ ఆరుగురు చొప్పున మొత్తం 503 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అలాగే సెకండరీ గ్రేడ్ టీచర్స్, సమాన స్థాయి కేడర్ ఉపాధ్యాయులు 600 మందికి పైగా ఉన్నారు.

జీతాలు వెంటనే చెల్లించాలి



బదిలీలు పూర్తయి నెల రోజులైనా కొత్త పోస్టులకు పొజిషన్ ఐడీలు ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదు. వెంటనే జీతాల సమస్యను పరిష్కరించాలి. జీతాలు పడకపోవడంతో ఉపాధ్యాయ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. జీతాలు సకాలంలో ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కొమ్మోజు శ్రీనివాసరావు, యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు

కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలు

- పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు న్యాయం చేస్తాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



నాయకులను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వేదికపై కేపీ నాగార్జునరెడ్డి, వెంకాయమ్మ, బత్తుల

గిద్దలూరు రూరల్: కార్యకర్తలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మూలస్తంభాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వితాసుబ్బరత్నం కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ముందుగా సమావేశంలో వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు న్యాయం జరిగేలా పార్టీ అండగా నిలబడుతుందన్నారు. కార్యకర్తలు లేకపోతే ఏ పార్టీ మనుగడలో ఉండలేదన్నారు. అటువంటి కార్యకర్తల సంక్షేమం కోసం జగనన్న ప్రత్యేక దృష్టి సారించాడన్నారు. ఒక్క సారి జగనన్న మాట ఇచ్చాడంటే దానికి ఎంతగా కట్టుబడి ఉంటాడో ప్రజలందరికీ తెలుసన్నారు. పేద ప్రజలకు న్యాయం జరిగేలా అహర్నిశలు శ్రమించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు అబద్ధాల హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారం చేపట్టిన తరువాత సూపర్ సిక్స్ హామీలనే అమలు చేయలేకపోతున్నాడని విమర్శించారు. ఇటువంటి దౌర్భాగ్యపు ముఖ్యమంత్రి దేశ చరిత్రలో ఎవరూ లేరని అన్నారు. ఎన్నికలకు ముందు మహిళలకు రాష్ట్రమంతటా ఉచిత బస్సు అని చెప్పి అధికారం చేపట్టిన తరువాత కేవలం జిల్లాకు మాత్రమే పరిమితం అని చెబుతున్నాడన్నారు. అబద్ధపు హామీలు ఇవ్వకపోవడం వల్లే జగనన్న అధికారంలోకి రాలేకపోయాడన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామంటూ చంద్రబాబునాయుడు పగటి కలలు కంటున్నాడని, అది వారి తరం కాదన్నారు. ప్రజల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న మహానేత వారసుడు జగనన్నను ప్రజలు ఎప్పటికీ దూరం చేసుకోలేరన్నారు. అబద్ధాల హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులకు ప్రవేశం లేదని పోలీసు స్టేషన్‌లల్లో బోర్డులు పెట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. అక్రమ కేసులు బనాయించి పార్టీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టాలని చూస్తున్నారన్నారు. మిర్చి, పత్తి, పొగాకు రైతులకు అండగా నిలబడి వారి తరఫున పోరాడే ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని అన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఈవీఎంల ద్వారా అధికారం చేపట్టిన తరువాత రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మండిపడ్డారు. ఎవరిని ఎప్పుడు అరెస్ట్ చేసి జైలుకు పంపాలో ఒక జాబితాను సిద్ధం చేసుకుని పాలన కొనసాగిస్తున్నారన్నారు. పోలీసులను టీడీపీ కార్యకర్తల్లా ఉపయోగించుకుంటున్నారన్నారు. మహిళా నాయకుల పై దౌర్జన్యాలకు పాల్పడుతూ విధ్వంస పాలన చేస్తున్నారని విమర్శించారు. జగనన్న తిరిగి అధికారంలోకి రాగానే ఎవరు ఏం చేస్తున్నారో అన్నీ గుర్తుపెట్టుకుని వారికి తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

అక్రమ కేసులకు భయపడద్దు:

అక్రమ కేసులకు భయపడకుండా మొండి ధైర్యంతో ముందుకు సాగుదామని గిద్దలూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ అమలవుతోందన్నారు. రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారన్నారు. ప్రజలకు పూర్తి స్థాయిలో పథకాలు అమలు చేయడం లేదన్నారు. పొదిలిలో పొగాకు రైతులకు బాసటగా నిలిచేందుకు వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డిని చూసి కూటమి ప్రభుత్వం కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టిందన్నారు. అందులో భాగంగానే అర్ధవీడు, గిద్దలూరు, కంభం మండలాల్లో కొందరు కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారన్నారు.

జగనన్నను తిరిగి ముఖ్యమంత్రి చేసుకుందాం..

రాబోయే ఎన్నికల్లో జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా, కె.పి.నాగార్జునరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్‌లల్లో నగదు జమయ్యేలా చేసి ఎక్కడా అవినీతి లేని పాలన కొనసాగించిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా 2 వేల వ్యాధులను బాగు చేసుకునే అవకాశం కల్పించాడన్నారు. గ్రామ స్వరాజ్యం కోసం గ్రామంలోనే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చాడని చెప్పారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మోసాలతో పాటుగా అబద్ధాల హామీలను తెలియజేసే క్యూఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, గిద్దలూరు, కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు, రాచర్ల ఎంపీపీలు కడప లక్ష్మీ, చేగిరెడ్డి తులసమ్మ, ఓసూరారెడ్డి, వెంకట్రావు, షేక్.ఖాశింబీ, బేస్తవారిపేట, కొమరోలు, జెడ్పీటీసీలు వెంకటరాజయ్య, సారె వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ కడప వంశీధర రెడ్డి, రవికుమార్ యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఆర్‌ఐ మురళి, పగడాల శ్రీరంగం, మానం బాలిరెడ్డి, మండల కన్వీనర్‌లు బత్తిని ఓబులరావు, ఏరువా రంగారెడ్డి, గోడి వెంకటేశ్వరరెడ్డి, చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి,జింకా రమేష్‌యాదవ్, డా.భూమా నరసింహారెడ్డి, బొర్రా క్రిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌ను పునరుద్ధరించాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

- పైపులు తరలించేందుకు సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: పట్టణ శివారు ప్రాంతంలో తొలగించిన సాగర్ పైప్‌లైన్‌ను పునరుద్ధరించాలని, అందుకు సహకరించిన అధికారులు, టీడీపీ నాయకులు, కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ హెచ్చరించారు. స్థానిక పార్టీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలకు తాగునీటి అవసరాల కోసం ప్రత్యామ్నాయం అయిన డీఐకే 7 పైపులను తొలగిస్తున్న విషయాన్ని కలెక్టర్, మార్కాపురం సబ్ కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, డీఈలతో ఫోన్‌లో మాట్లాడానని, ఆ పైప్‌లైన్ ప్రాముఖ్యతల గురించి వివరించారని, అయినా కాంట్రాక్టర్ యథేచ్ఛగా ఎత్తుకొని వెళ్తున్నాడని ఆయన ఆయన ఆరోపించారు. నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడికి కాసుల వర్షం కురిపించిన కాంట్రాక్టర్ పైపులు తరలించడమే పనిగా పెట్టుకున్నాడని, ఈ చర్య యర్రగొండపాలెం పట్టణ ప్రజలకు అన్యాయం చేయడమేనని అన్నారు. భూమిలో ఉన్న కోట్లాది రూపాయల విలువచేసే పైపులు తీసుకొని వెళ్తుంటే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఉలుకు పలుకు లేకుండా ఉండటంలో అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. తాగునీటి సమస్యలకు పరిష్కారం ఇవ్వాల్సిన ప్రభుత్వ అధికారులు ఉన్న వ్యవస్థను ధ్వంసం చేయడం, వాటిని పక్క నియోజకవర్గంలో జరుగుతున్న పనులకు వినియోగించడాన్ని చూస్తుంటే కాంట్రాక్టర్ ఎరిక్షన్‌బాబుకు పెద్ద ఎత్తున ముడుపులు అప్పచెప్పింది వాస్తవమన్న అనుమానం ప్రజల్లో బలంగా నెలకొందని అన్నారు. ఇటీవల పట్టణ ప్రజలకు 10 రోజులుగా సాగర్ నీళ్లు అందక అనేక ఇబ్బందులు పడ్డారని, అందుకు కారణం సాగర్ పైప్ లైన్ డ్యామేజి కావడమేనని ఆయన అన్నారు. ఇంతటి దుశ్చర్యకు పాల్పడిన అధికారులు, అధికార పార్టీ నాయకుడు, కాంట్రాక్టర్‌లను న్యాయస్థానం ముందు నిలబెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. సమావేశంలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, వైస్ ఎంపీపీ మందుల ఆదిశేషు, పుల్లల చెరువు మండల పార్టీ అధ్యక్షుడు దోమకాల వెంకటేశ్వర్లు, సర్పంచ్ ఆవుల కోటిరెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

చంద్రబాబువి కక్షపూరిత రాజకీయాలు

- పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అన్యాయం
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి



మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

ఒంగోలు సిటీ: ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు కుట్రలు, కక్షపూరిత రాజకీయాలు చేయడం మొదటి నుంచి అలవాటేనని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డిని విచారణ పేరుతో పిలిచి అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలన అంతా అక్రమంగా అరెస్ట్‌లు చేయడం, కేసులు పెట్టడంతోనే సరిపోతుందని, పరిపాలన గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి సూపర్‌సిక్స్ పథకాల పేరుతో అబద్ధాలు చెప్పి అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాల ఊసే చంద్రబాబు ఎత్తడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలోని నాయకుల దోపిడీలు పెరిగిపోయాయని, ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఈ 13 నెలల కాలంలో చంద్రబాబు చేసింది శూన్యమని, అరాచకాలు, దోపిడీలు, అమాయకులపై అక్రమ కేసులు బనాయించి నానా ఇబ్బందులు పెడుతుండటంతో ప్రజా పోరాటాలు చూసి చంద్రబాబుకు వణుకు పుడుతోందన్నారు. వైఎస్సార్ సీపీ బలోపేతం కావడాన్ని, ప్రజల్లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు పార్టీలోని ముఖ్యమైన నాయకులను టార్గెట్ చేసి అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో చేస్తున్న అక్రమాలు, దోపిడీలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు కుట్రలకు వైఎస్సార్ సీపీ నాయకులు భయపడే ప్రసక్తే లేదన్నారు. చంద్రబాబు దుర్మార్గాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని చెప్పారు. కూటమి ప్రభుత్వ తీరు ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారని, రాబోయే రోజుల్లో చంద్రబాబుకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. లిక్కర్ కేసులో ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవనీ, అయినా ముఖ్యమైన నాయకులందరినీ అక్రమంగా అరెస్ట్‌లు చేయడం దారుణమన్నారు.

పశువుల మేత భూమి కబ్జా

- దొంగ డాక్యుమెంట్లు సృష్టించి బెదిరిస్తున్నారు
- సింగరాయకొండలోని ఏపీఐఐసీ భూమిలో 22ఏ కింద రిజిస్ట్రేషన్లు ఆపారు
- మీ కోసంలో కలెక్టర్‌కు సమస్యల వినతి



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న పొదిలి మండలం నిమ్మవరం గ్రామస్తులు

ఒంగోలు సబర్బన్: పొదిలి మండలం నిమ్మవరం గ్రామంలో స్థానికంగా ఉంటున్న అధికార పార్టీకి చెందిన నాయకుడు 8.25 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నాడని, అదే గ్రామానికి చెందిన గుదె నాగరాజు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి గ్రామస్తులు కొందరితో కలిసి వచ్చిన నాగరాజు ప్రభుత్వానికి చెందిన సర్వే నంబరు 8/4లోని పశువుల మేత భూమిని అధికార పార్టీకి చెందిన కొల్లూరి నాసరయ్య కబ్జా చేసి సాగు చేసుకుంటున్నాడని కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలోని పశువులు మేత కోసం అల్లాడుతున్నాయన్నారు.

☛ నిమ్మవరం గ్రామానికే చెందిన కటికాల నాగేశ్వరరావు కూడా కలెక్టర్‌ను కలిసి తనకు అన్యాయం జరిగిందన్నారు. గ్రామంలో తనకు గ్రామ సర్వే నం. 7/3లో 2 ఎకరాల పొలం ఉందని, ఆన్‌లైన్‌లో తన పేరు మీదనే నమోదై ఉందన్నారు. పాస్‌బుక్ కూడా ఉందని చెప్పారు. ప్రస్తుతం ఆ పొలాన్ని తానే సాగు చేసుకుంటున్నానని వివరించాడు. అయితే తమ గ్రామానికి చెందిన కొల్లూరి నాసరయ్య, ఆయన కుమారుడు కొల్లూరు నరేష్, పొదిలి మండలం కాటూరివారిపాలేనికి చెందిన కోటు వెంకట్రావు, కోటు శ్రీనులు ఈ నెల 16వ తేదీ తమ పొలాన్ని దౌర్జన్యంగా దున్నారన్నారు. వాళ్లు రెండు ట్రాక్టర్లతో వచ్చి ఈ పొలం మాది మేము కొన్నామని దౌర్జన్యం చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. తాను పొలం ఎవరికీ అమ్మలేదని, దొంగ డాక్యుమెంట్లు తయారు చేసుకొని తనను బెదిరిస్తున్నారని వాపోయాడు. తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌నే వేడుకున్నాడు.

ఏపీఐఐసీ ప్లాట్లను 22ఏ నుంచి తొలగించాలి..

సింగరాయకొండలో ఏపీఐఐసీ ప్లాట్లను నిషేధిత 22ఏ నుంచి తొలగించి తనకు అప్పగించాలని టంగుటూరు మండలానికి చెందిన ఒక కుటుంబం వచ్చి జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణకు విన్నవించారు. టంగుటూరుకు చెందిన కొణిజేటి సత్య నారాయణ కుటుంబ సభ్యులు వచ్చి సింగరాయకొండ ఏపీఐఐసీ ప్లాట్లలో తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. సోమరాజుపల్లి గ్రామ సర్వే నం.677 లో 100, 101 నంబరున్న ఏపీఐఐసీ ప్లాట్లు 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. ఏపీఐఐసీ వాళ్ల లేఅవుట్ ప్లాను ప్రకారం ప్లాట్లు పెట్టారని అయితే ప్రభుత్వ రికార్డుల్లో 22 ఏ నిషేధిత జాబితాలో ఉందని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు చెబుతున్నారని చెప్పారు. ఏపీఐఐసీ అధికారులు తమ పేరుమీద సేల్ డీడ్ కూడా చేశారని, పరిశీలించి తమ ప్లాట్లను 22 ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు.

అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి:

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని అధికారులను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. అర్జీలు పరిశీలించి అర్జీదారులు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఎస్.డి.సీ వర కుమార్, శ్రీధర్ రెడ్డి, జాన్సన్, పార్థసారధి, కుమార్ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

క్లుప్తంగా

లారీలో నిద్రిస్తూ క్లీనర్ మృతి



మద్దిపాడు: లారీలో నిద్రిస్తున్న క్లీనర్.. అనారోగ్యంతో నిద్రలోనే మృతిచెందిన సంఘటన మద్దిపాడు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్ రాష్ట్రం సిద్ధి జిల్లా సలార్ గ్రామానికి చెందిన లారీ క్లీనర్ రామ్ ఉద్గర్ తన డ్రైవర్తో కలిసి తిరుచి బీహెచ్ఈఎల్ నుంచి లోడ్ తీసుకుని చత్తీస్‌గడ్ వెళ్తున్నాడు. మార్గం మధ్యలో ఆయాసంతో అస్వస్థతకు గురయ్యాడు. డ్రైవర్ మందులు తీసుకురాగా వేసుకున్నాడు. కొంత పరవాలేదని తెలపడంతో వారు ఆదివారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో మద్దిపాడు సమీపంలోని ఒక దాబా వద్దకు చేరుకున్నారు. అక్కడ డ్రైవర్ భోజనం చేయగా క్లీనర్ రెండు బిస్కెట్లు తిన్నాడు. అనంతరం ఇద్దరూ నిద్రించాడు. సోమవారం ఉదయానికి క్లీనర్ మృతి చెంది ఉండటంతో డ్రైవర్ ఆందోళనకు గురై మద్దిపాడు పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు.

ముమ్మాటికీ మృత్యుకేళి!

ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణపై కూటమి సర్కారు నిర్లక్ష్యం

- మార్కాపురం జీజీహెచ్‌లో ఆక్సిజన్ ప్లాంట్ ఏడాదిగా మూత
- ఆస్పత్రి వైద్యులు, ప్రొఫెసర్ల బదిలీతో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం



మార్కాపురం జీజీహెచ్‌లో నిరుపయోగంగా ఉన్న లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్



మార్కాపురం జీజీహెచ్

మార్కాపురం: పేదలకు మెరుగైన వైద్యం అందించడంపై దృష్టి సారించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలను నీరుగార్చేందుకు కంకణం కట్టుకుంది. పశ్చిమ ప్రకాశంలో కీలకమైన మార్కాపురం జిల్లా వైద్యశాలలో మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నాయకులు.. పెద్ద సంఖ్యలో వైద్యులు, ప్రొఫెసర్ల బదిలీ, మెడికల్ కళాశాల నిర్మాణం నిలిపివేతపై మాత్రం నోరు మెదపడం లేదు. మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మార్కాపురంలోని రాయవరం వద్ద మెడికల్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. కళాశాలకు అనుబంధంగా ఉన్న జిల్లా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గత ప్రభుత్వంలో పెద్ద సంఖ్యలో వైద్యులను నియమించగా కూటమి అధికారంలోకి రాగానే వారిలో మూడొంతుల మందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజుకు 100 మందికి మించడం లేదు.

ఆక్సిజన్ ప్లాంట్ ఏడాదిగా మూత

మార్కాపురం జీజీహెచ్‌లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంటు ఏడాది కాలంగా నిరుపయోగంగా ఉంది. 2020లో కోవిడ్ బాధితులు ఆక్సిజన్ అందక మత్యువాత పడుతున్న సమయంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ యుద్ధ ప్రాతిపదికన ఆక్సిజన్ ప్లాంట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కోటి రూపాయల వ్యయంతో 10 వేల లీటర్ల కెపాసిటీ గల 2 ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అందులో ఒకటి లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంటు, మరొకటి జనరల్ ఆక్సిజన్ ప్లాంట్. 2021లో కోవిడ్ రెండో దశలో ఈ ఆక్సిజన్ ప్లాంట్ వందలాది మందికి ప్రాణం పోసింది. అలాంటి ఆక్సిజన్ ప్లాంట్ నిర్వహణను కూటమి ప్రభుత్వం ఏడాదిగా గాలికొదిలేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టెక్నీషియన్లు లేకపోవడంతో లిక్విడ్ ప్లాంట్ నుంచి ఆక్సిజన్ ఉత్పత్తి నిలిచిపోయింది. ప్రస్తుతం పశ్చిమ ప్రకాశంలోని సుమారు 12 మండలాల నుంచి నెలకు 30 మంది వరకు రోగులు జీజీహెచ్‌లో ఆక్సిజన్ సేవలు పొందేందుకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌ను కూడా నిర్వహణలో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

> **మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం**
> మార్కాపురం జీజీహెచ్‌లో ప్రస్తుతం ఒక ఆక్సిజన్ ప్లాంటు అందుబాటులో ఉంది. మరొక ఆక్సిజన్ ప్లాంటు మరమ్మతులకు గురైంది. రిపేర్లు చేయాలని ఉన్నతాధికారులకు రిపోర్టు పంపాం. ప్రస్తుతం రోగులకు అవసరమైన ఆక్సిజన్‌ను ఒక ప్లాంట్ ద్వారా అందిస్తున్నాం.
> – డాక్టర్ రామచంద్రరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్, మార్కాపురం

బంద్ చేస్తుంటే బండ్లెట్టా తిప్పుతారు?

- చెత్త సేకరణ వాహనాన్ని అడ్డుకున్న పారిశుధ్య కార్మికులు



చీమకుర్తిలో చెత్త సేకరణను అడ్డుకుంటున్న మున్సిపల్ వర్కర్లు

చీమకుర్తి: పట్టణంలో చెత్త సేకరిస్తున్న ట్రాక్టర్‌ను సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు సోమవారం అడ్డుకున్నారు. తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం ఆరో రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో కోవిడ్ కార్మికులతో మున్సిపల్ అధికారులు చెత్త సేకరించేందుకు చర్యలు తీసుకున్నారు. దానిలో భాగంగా చీమకుర్తి పట్టణంలో కోవిడ్ కార్మికులు చెత్త సేకరిస్తూ ట్రాక్టర్‌లో వేస్తుండగా, సమ్మెలో ఉన్న మున్సిపల్ కార్మికులు అడ్డుకుని సీఐటీయూ జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తోందని సీఐటీయూ నాయకులు, మున్సిపల్ వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తారస్థాయికి చేరిన రెడ్‌బుక్ పాలన

- చంద్రబాబు పాలన మొత్తం కుట్రలు, కుతంత్రాలే
- ప్రజలను పక్కదారి పట్టిస్తున్న కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, నాయకులు

ఒంగోలు సిటీ: చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అక్రమాలు, అరెస్టులతో కూడిన రెడ్‌బుక్ పాలన తారస్థాయికి చేరిందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు ధ్వజమెత్తారు. పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు తారాస్థాయికి చేరాయన్నారు. ఎన్నికల ముందు అబద్ధపు హామీలిచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను నిట్టనిలువునా చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. వాటిపై ఎవరైతే ప్రశ్నిస్తారో వారిని అక్రమంగా అరెస్టులు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులను టార్గెట్ చేస్తూ అక్రమ అరెస్టుల చేస్తూ ఇబ్బందులు పెడుతోందన్నారు. తమ నాయకుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు అండగా ఉన్నారని, కూటమి అక్రమాలను ప్రశ్నించడంలో వెనక్కు తగ్గేదే లేదని బొట్ల సుబ్బారావు స్పష్టం చేశారు. పొగాకు ధరలు పతనమైతే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి వచ్చి పొగాకు రైతులకు అండగా నిలబడ్డారన్నారు. నిత్యం సమస్యలపై స్పందిస్తూ ప్రజల్లోకి జగనన్న రావడం, ఆయన పర్యటనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించడాన్ని ఓర్వలేని చంద్రబాబు.. వైఎస్సార్ సీపీ బలపడుతుందనే భయంతో నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారన్నారు. ప్రజల్లో జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి చంద్రబాబు తట్టుకోలేక అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. అందులో భాగంగానే మాజీ సీఎస్ ధనుంజయ్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, కాకాని గోవర్ధనరెడ్డిని అరెస్ట్ చేశారని, వల్లభనేని వంశీ, కొమ్మినేని శ్రీనివాసరావుపై అక్రమ కేసులు బనాయించి హింసిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు ఒక సామాజికవర్గంపై కక్షగట్టి హింసించే పనిలో ఉన్నారన్నారు. చంద్రబాబు ఇస్తామన్న సంక్షేమ పథకాలు ఇవ్వలేక ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. లిక్కర్ కేసులో ఎటువంటి ఆధారాలు లేవని విమర్శించారు. అలాంటి కేసులో అక్రమ అరెస్టులు చేసి జైలుపాలు చేస్తున్నారని విమర్శించారు. పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని సిట్ విచారణకు పిలిచి అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. చంద్రబాబు బెదిరింపులకు వైఎస్సార్ సీపీ బెదరదన్నారు. ఆయన కుట్రలు, కుతంత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కూటమి ప్రభుత్వం ముందు ఎన్నో సమస్యలున్నా.. పరిష్కరించకపోగా, ప్రజలను ఇబ్బందులు పెడుతోందని విమర్శించారు. సంక్షేమ పథకాలు ఇవ్వడానికి డబ్బులు లేవని చంద్రబాబు ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. అమరావతిలో బురదలో దొర్లించడానికి మీకు డబ్బులు వస్తాయా..? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ దోపిడీపై అన్ని వర్గాలు, అన్ని రంగాలలో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని బొట్ల సుబ్బారావు అన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జి.రజిని, మాతాశిశు వైద్యశాల మాజీ డైరెక్టర్ సాధం విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు సుతారం శ్రీను, నాయకులు దాసరి కరుణాకర్, కుట్టుబోయిన కోటియాదవ్, పిగిలి శ్రీనివాస్, ఫణిదపు సుధాకర్, బాలకృష్ణ, షేక్ జిలానీ బాషా, కె.సురేష్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనంతా కక్ష సాధింపులతోనే...

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు



చుండూరి రవిబాబు

చంద్రబాబు పాలనంతా పూర్తిగా కక్ష సాధింపులతోనే కొనసాగుతోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు అన్నారు. పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుపై సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలోని అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారన్నారు. పేదల తరఫున పోరాడుతున్నారన్నారు. 13 నెలల పాలనలో కూటమి ప్రభుత్వంపై వచ్చిన భారీ వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. లిక్కర్ స్కాం అంటూ అక్రమ కేసులతో పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చిన్నస్థాయి ఉద్యోగులను తీసుకెళ్లి కొట్టి అబద్ధాలు చెప్పించి వాటి ఆధారంగా కేసులు పెట్టడం, ప్రముఖులను అరెస్ట్ చేయడం క్రూరమైన చర్యని రవిబాబు అన్నారు. లేని స్కాంను సృష్టిస్తూ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ముందు 50 వేల కోట్లు, తర్వాత 30 వేల కోట్లు, ఆ తర్వాత 18 వేల కోట్లు, మొన్న 3 వేల కోట్లు అని, చివరకు 1800 కోట్లు అంటున్నారన్నారు. ఎంత స్కాం జరిగిందో వాళ్లకే కచ్చితంగా తెలియదని, రోజుకో విధంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మీరు ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదని రవిబాబు స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎంతో ఉత్సాహంగా పనిచేస్తారని, కూటమి ప్రభుత్వ అక్రమాలను నిలదీస్తారని, వైఫల్యాలను ఎండగడతారని, దోపిడీలను అరికడతారని హెచ్చరించారు.

సముద్రంలో గల్లంతైన యువకుడు మృతి



తీరానికి కొట్టుకొచ్చిన నాగచందు మృతదేహం

కొత్తపట్నం: స్నేహితులతో కలిసి ఆదివారం సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతైన యువకుడు కడలి కెరటాలకు బలయ్యాడు. యువకుడి మృతదేహం సోమవారం వజ్జిరెడ్డిపాలెం తీరానికి కొట్టుకొచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. టంగుటూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన జలదంకి నాగచందు అలియాస్ చందు(19) ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్నాడు. గత పది రోజుల నుంచి సోలార్ షాప్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి కొత్తపట్నం మండలంలోని మడనూరు బీచ్‌కు వచ్చాడు. సముద్రంలో మునుగుతున్న క్రమంలో అలల తాకిడికి చందు కొట్టుకుపోయాడు. అదే సమయంలో సోలార్ షాప్ ఓనర్ వెంకటేష్ ఫోన్ చేయడంతో చందు సముద్రంలో గల్లంతయ్యాడని స్నేహితులు చెప్పారు. షాప్ ఓనర్ ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు మడనూరు బీచ్‌లో గాలించినా ఫలితం లేకపోవడంతో మెరైన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా సోమవారం ఉదయం 8 గంటల సమయంలో చందు మృతదేహం వజ్జిరెడ్డిపాలెం తీరానికి కొట్టుకొచ్చింది. మత్స్యకారుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్సై సుధాకర్‌బాబు తన సిబ్బందితో కలిసి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి తండ్రి సురేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. చేతికందివచ్చిన కుమారుడు అర్ధంతరంగా కన్నుమూయడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



రవితేజ(ఫైల్)

కొండపి: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన కొండపి పంచాయతీలోని కట్టావారిపాలెంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఇంట్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో రవితేజ(30) ఫ్యూజులు సరిచేసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురైన రవితేజ గట్టిగా కేకలు వేస్తూ కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలు జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అప్పటికే రవితేజ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 68 ఫిర్యాదులు



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు సిటీ: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పోలీస్‌శాఖ గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు నేరుగా వచ్చి తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా ఎస్పీకి, పోలీస్ అధికారులకు విన్నవించారు. ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలడిగి తెలుసుకున్న ఎస్పీ.. చట్టపరంగా విచారణ జరిపి సత్వరమే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. మొత్తం 68 ఫిర్యాదులు రాగా, వాటిపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఎస్పీ మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్, ఎస్సీ/ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ షమీముల్లా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాండురంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు

బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- ఒంగోలుకు చెందిన బంగారు షాప్ యజమాని తన షాపులో పనిచేస్తున్న అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన గుమస్తా మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. షాపులో ఉన్న బంగారం అమ్ముకుని అవసరాల కోసం ఆ డబ్బు వాడుకున్నాడని, లెక్కలు సరిగ్గా చూపకుండా మోసం చేశాడని ఫిర్యాదు చేశారు.
- దర్శి మండలంలోని ఒక సచివాలయం సిబ్బంది సబ్సిడీ కింద వ్యవసాయ పనిముట్లు ఇప్పిస్తానంటూ అద్దంకి మండలానికి చెందిన ఒక రైతు వద్ద నుంచి రూ.3,80,000 డబ్బు తీసుకున్నాడు. పనిముట్లుగానీ, డబ్బులుగానీ ఇవ్వడం లేదని రైతు ఫిర్యాదు చేశారు.
- తన కుటుంబ అవసరాల నిమిత్తం ఒంగోలుకు చెందిన ఒక మహిళ రూ.1,50,000 అప్పు తీసుకుని తిరిగి చెల్లించేటప్పుడు చెల్లని చెక్కు ఇచ్చి మోసం చేసిందని, అడుగుతుంటే బెదిరిస్తోందని ఒంగోలు గోపాలనగరానికి చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేసింది.

ఉపాధి కార్యాలయానికి తాళం!

- 19 నెలల నుంచి అధికారులు అద్దె చెల్లించలేదని తాళం వేసిన భవన యజమాని
- మండల స్థాయి అధికారులకు సమాచారం అందించని ఏపీవో



ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో జ్యోతి

మద్దిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మద్దిపాడు మండల కార్యాలయానికి ఆ భవన యజమాని తాళం వేశారు. ఓ ప్రైవేటు భవనంలో ఉపాధి కార్యాలయం నిర్వహిస్తుండగా, 19 నెలల నుంచి అద్దె చెల్లించకపోవడంతో యాజమాని కడియాల ఉమామహేశ్వరరావు స్థానిక ఏపీఓ ధనుంజయవర్మను అడిగారు. పైఅధికారులు ఇస్తేనే తాము ఇవ్వగలమని, లేకపోతే ఎక్కడి నుంచి తీసుకురావాలని ఏపీవో సమాధానం చెప్పడంతో భవన యజమాని తాళం వేస్తామంటూ హెచ్చరించారు. అయినప్పటికీ మండల స్థాయి అధికారులకు ఏపీవో తెలియజేయకపోవడం, సరైన సమాధానం చెప్పకపోవడంతో భవన యజమాని గత శనివారం సాయంత్రం కార్యాలయం ముగిసిన తర్వాత మరొక తాళం తీసుకొచ్చి వేశారు. సోమవారం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది తలుపులకు మరో తాళం వేసి ఉండటాన్ని గమనించారు. ఏపీఓ, ఎంపీడీవోలకు ఫోన్ చేసి చెప్పారు. మద్దిపాడులోని ఎంపీపీ పాఠశాలలో ఓ గది ఖాళీగా ఉండగా, ఉపాధ్యాయులతో మాట్లాడి అందులో ఉపాధి హామీ కార్యాలయ నిర్వహణకు స్థానిక ఎంపీడీవో వి.జ్యోతి ఏర్పాట్లు చేశారు. దీనిపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ కార్యాలయ సిబ్బందితో అత్యవసర సమావేశాన్ని ఎంపీడీవో నిర్వహించి చర్చించారు. శనివారం సాయంత్రం ఉపాధి కార్యాలయం వద్ద భవన యజమానికి–ఏపీఓకు జరిగిన వాదనలను తమ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ఎంపీడీవో అడగడంతో ఏపీవో ధనుంజయవర్మ సమాధానం చెప్పకుండా నీళ్లునమిలారు. డ్వామా పీడీకి తెలియజేశానని చెప్పగా, పీఓకు సంబంధం లేకుండా నేరుగా జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. పాఠశాల గదిలోకి ఉపాధి హామీ కార్యాలయాన్ని మార్చుకోవాలని ఆదేశించారు. అయితే, కార్యాలయానికి సంబంధించిన ఫైళ్లు, కంప్యూటర్లు, స్టేషనరీ మొత్తం అద్దె భవనంలోనే ఉండిపోవడంతో విధులు ఎలా నిర్వర్తించాలో అర్థంగాక ఉపాధి సిబ్బంది అయోమయంలో ఉన్నారు.

నీళ్ల ట్యాంకుకు పసుపు రంగు



జువ్వలేరులో మినీ ట్యాంక్‌కు వేసిన పసుపు రంగు

పొదిలి రూరల్: రంగుల పేరుతో గత ప్రభుత్వంలో టీడీపీ శ్రేణులు చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. కూటమి అధికారంలోకి రాగానే నాడు వల్లె వేసిన నీతి సూక్తులు మటుమాయమైపోయాయి. గత ప్రభుత్వం చేపట్టిన శిలాఫలకాలు ధ్వంసం చేయడమే కాకుండా నాడు చేపట్టిన పనులను సైతం తమ ఖాతాలో వేసుకునేందుకు టీడీపీ నాయకులు ఏమాత్రం సంకోచించడం లేదు. పొదిలి మండలంలోని జువ్వలేరు గ్రామంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మినీ వాటర్ ట్యాంకులు నిర్మించింది. అయితే బీసీ కాలనీలో నిర్మించిన మినీ ట్యాంక్‌కు టీడీపీ నాయకులు పసుపు రంగు వేసి 'మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సహకారంతో తాగునీరు' అని పేరు రాయించడం గమనార్హం. టీడీపీ నేతల తీరుపై గ్రామస్తులు మండిపడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి పసుపు రంగు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

దారంతా మడుగు.. ఎటెయ్యాలో అడుగు?



నీటిలో దిగకుండా రోడ్డు అంచున నడుస్తూ అవస్థపడుతున్న విద్యార్థులు

మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డు మొత్తం వర్షం నీటితో నిండిపోయింది. ఆదివారం కురిసిన వర్షానికి సుమారు అడుగు ఎత్తున నీరు నిలిచిపోయింది. దీంతో సోమవారం పాఠశాల, కళాశాలకు రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నీటిలో దిగకుండా వెళ్లేందుకు రోడ్డు అంచున నడుస్తూ పడరాని పాట్లు పడ్డారు. ఈ రహదారికి మరమ్మతులు చేసి వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. – మద్దిపాడు